క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు స్టీల్ ట్రాలీల బహూకరణ



అంతర్వేదిలో నిత్యాన్నదాన ట్రస్టుకు ట్రాలీలు ఇస్తున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు అధినేత నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్, మాధవి దంపతులు రూ.50 వేలు విలువైన రెండు స్టీల్ ట్రాలీలను బహూకరించారు. ఈ మేరకు వీటిని నిత్యాన్నదానం షెడ్డులో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు దాత అందజేశారు. నిత్యాన్నదానంలో అన్నం, కూరలు, సాంబారు, పెరుగు వడ్డించడానికి ఈ ట్రాలీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని దాత అన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు స్వామిని నూతనంగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన రుద్రరాజు భీమరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్రేయపురం ఎస్సైగా రాము



ఆత్రేయపురం: స్థానిక ఎస్సైగా ఎస్.రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తొలుత వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు.

ఉపాధ్యాయురాలికి అవార్డు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలోని ఎంపీపీఎస్, ఎల్ఎన్ఎస్ టెంపుల్ పాఠశాల ఉపాధ్యాయిని పిచ్చుక నాగ శ్రీవిద్యకు శనివారం కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందజేసింది. ఈ మేరకు కాకినాడలో సదరు అవార్డు ఆమె తీసుకున్నారు. బోధనలో వినూత్న అభ్యాసన పద్ధతులు అవలంబించి, విద్యార్థులకు ఆసక్తికరమైన రీతిలో విద్యను అందిస్తున్న నేపథ్యంలో చేయూత సంస్థ ఆమెకు పై అవార్డు ఇచ్చి సత్కరించింది.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



చిరతపూడిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ బేబీరాణి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తూ శనివారం జ్వరాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ బేబీరాణి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్, వార్డు సభ్యులు పచ్చిపాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై పార్టీలకు అవగాహన

పి.గన్నవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదు కార్యక్రమంపై మండలంలోని రాజకీయ పార్టీల నాయకులకు శనివారం తహసీల్దార్ పి.శ్రీపల్లవి తన కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గడువు తేదీ నాటికి కొత్త ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కోసం మండలంలో మొత్తం 100 దరఖాస్తులు వచ్చాయని, అయితే 96 దరఖాస్తులను ఆమోదించి, నాలుగింటిని తిరస్కరించినట్టు శ్రీపల్లవి తెలిపారు. సమావేశంలో డీటీలు రమాదేవి, పూర్ణిమ, ఆర్ఐ పి.నర్సింహారావు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి శనైశ్చర స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ప్రతి శనివారం మాదిరిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ.1,39,905, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.36,109తో కలిపి మొత్తం రూ.1,76,014 ఆదాయం వచ్చినట్టు ఈఓ విజయలక్ష్మి తెలిపారు.

వీడని వరద

- నీటిలోనే అప్పనపల్లి కాజ్‌వే
- ప్రజలకు తప్పని అవస్థలు



అప్పనపల్లి కాజ్‌వేపై నిలిచి ఉన్న వరద నీరు

మామిడికుదురు: మూడు లంక గ్రామాల ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న గోదావరి వరద ఇంకా అప్పనపల్లి కాజ్‌వేను వీడలేదు. కాజ్‌వేపై శనివారం సుమారు రెండడుగులకు పైగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ రోడ్డుపై నిలిపి వేసిన రాకపోకలు ఇంకా పునరుద్ధరణకు నోచుకోలేదు. కాజ్‌వే ముంపుబారిన పడడంతో అప్పనపల్లి గ్రామానికి ఆర్టీసీ సర్వీసును నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడంతో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధానంగా స్కూల్స్, కళాశాలలకు వెళ్లే బస్సుల రాకపోకలు నిలిచి పోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఈ మార్గాన్ని వరద నేపథ్యంలో బ్లాక్ చేసి బారికేడ్లు ఏర్పాటు చేసిన సంగతి విదితమే. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉన్న అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో వరద పూర్తిగా తగ్గడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర చిన్న వాహనాలు మాత్రం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువ కావడంతో ఈ మార్గంలో చిన్న వాహనాలు మాత్రమే తిరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వరద ధవళేశ్వరంలో క్రమ క్రమంగా తగ్గుతుండడంతో కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. ఆదివారం నాటికి కాజ్‌వేకు ముంపు నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

పి.గన్నవరం: వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. కె.ఏనుగుపల్లి, నాగుల్లంక పల్లిపాలెం రహదారులపై వరద తగ్గిన విషయం విదితమే. మానేపల్లి శివారు శివాయలంక వెళ్లే రహదారిపై వరద తగ్గడంతో పడవల స్థానంలో ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్‌పై ప్రయాణించి శివాయలంకకు వెళ్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు గత రెండు నెలలుగా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. లంక భూముల్లో చేతికి అందివచ్చిన పంటలు వరదల వల్ల పాడైపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. బూరుగులంక రేవు వద్ద వరద ఉధృతిని కొత్తపేట ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించి, లంక గ్రామాల ప్రజలతో మాట్లాడారు. రేవు వద్ద పహారా కాస్తున్న రెవెన్యూ, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీస్ సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చారు.

అయినవిల్లి మండలంలో..

అయినవిల్లి: వరద పూర్తిగా తగ్గుముఖం పట్టింది. దీంతో ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, చింతనలంక, పొట్టిలంక, కొండుకుదురులంక తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వరద తగ్గింది. లంక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కేశనపల్లి కళాశాలకు ఇన్‌చార్జి నియామకం



జె.శాంతికుమారి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: మండలంలోని కేశనపల్లి కళాశాలలో బోధన చర్యల మెరుగుకు జిల్లా విద్యా శాఖ చర్యలు తీసుకుంది. ఈ నెల 11న 'సాక్షి'లో ప్రచురితమైన 'గురువులే సర్కారుకు బరువు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుమ సోమశేఖరరావు స్పందించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టు స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాజోలు కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతి కుమారిని నియమించారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి అతిథి అధ్యాపకులు కావాలని వెంటనే దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో కేంద్ర మంత్రి పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామికి వివిధ ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసవర్మను పండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పండితులు ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన వెంట బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, నాయకులు పాలూరి సత్యానందం, మోకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం



మలికిపురంలో సాయం పొందిన లబ్ధిదారులతో వసుధ సంస్థ ప్రతినిధులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అనారోగ్యం వల్ల, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పలువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని చెక్‌ల రూపేణా శనివారం లబ్ధిదారులకు అందించారు. మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో బాధితులకు అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గోకవరపు జయ వాసవిలక్ష్మి(సఖినేటిపల్లి)కు రూ.20 వేలు, తుంటి ఫ్రాక్చర్‌తో బాధపడుతున్న ఇంజేటి ధర్మారావు (మలికిపురం)కు రూ.10 వేలు, వెన్నుపూస ఆపరేషన్ చేయించుకున్న వలవల లక్ష్మీపార్వతి (ఇరుసుమండ)కు రూ.10 వేలు, అలాగే వివిధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న నల్లా రమేష్‌కుమార్, కలిగిన లక్ష్మీనారాయణ, గుర్రం రామలక్ష్మి, తోట కల్యాణిలకు తలా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు గెద్దం తులసీభాస్కర్, కాజా నరసింహారావు, గెద్దాడ సత్యనారాయణ, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

జోరుగా లడ్డూ వేలం

అంబాజీపేట: గణపతి నవరాత్రుల సందర్భంగా అంబాజీపేట మండలంలో ఆయా గ్రామాల్లో నెలకొల్పిన చవితి పందిళ్ల వద్ద శనివారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. కొర్లపాటి వారిపాలెంలో బాల గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ పందిరి వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. అనంతరం స్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చిన లడ్డూను స్థానికులు కలిగినీడి రఘు, చిన్నాలు రూ.16,100కు వేలంలో దక్కించుకున్నారు. అలాగే మండలంలో చవితి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు చేశారు. అనంతరం స్వామి వారి నిమజ్జన కార్యక్రమాలు చేశారు.

సువర్ణ సింహతలాటంతో సన్మానం



పెదపట్నంలంకలో కొండయ్య దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

మామిడికుదురు: పెదపట్నంలంక గిడుగువారిపాలెం బాల గణపతి ఆలయ కమిటీ చైర్మన్ గుండాబత్తుల సత్యనారాయణమూర్తి (కొండయ్య) దంపతులను స్థానికులు శనివారం సువర్ణ సింహతలాటం అందించి ఘనంగా సన్మానించారు. గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఏకాహం జరిగింది. ఏటా గణపతి నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తారు. ప్రముఖ భజన కళాకారుడిగా కొండయ్య కళా రంగానికి ఎన్నో సేవలందించారని సుప్రసిద్ధ భజన గురువు కుంపట్ల బాపన్నాయుడు, సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, అడబాల తాతకాపు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మాజీ ఎంపీటీసీ కొమ్ముల రాము పేర్కొన్నారు. కార్యక్రమంలో కంకిపాటి వెంకటేశ్వరరావు, గిడుగు వెంకటరామారావు, యేడిద రఘు, మామిడిశెట్టి శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి పందిరిలో వైద్యులకు సన్మానం



కొత్తపేట సంతోష్‌నగర్‌లో డాక్టర్ ఉదయభాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపేట: స్థానిక సంతోష్‌నగర్ వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ పందిరిలో స్థానిక పలువురు వైద్యుల దంపతులను ఘనంగా సత్కరించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు వివిధ పూజలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న భాస్కర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు, ఆయన కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందించడంతో పాటు విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక రోజు వారు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు–వెంకటలక్ష్మి, డాక్టర్ సి.మధుకర్–డాక్టర్ ఎం సుమలత, డాక్టర్ మెంటే శ్రీధర్‌నాయుడు–డాక్టర్ ప్రదీప్తికరుణ దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్సవ కమిటీ ద్వారా డాక్టర్ ఉదయభాస్కరరావు సుమారు 100 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చోడపనీడి భాస్కరరావు, బైరిశెట్టి శ్రీనివాసరావు, బండి సూరిబాబు, చోడపనీడి రామకృష్ణ, బండారు వెంకన్న, రావుల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలు కృష్ణ కార్తీక్, రాహుల్‌కు మెడల్స్ అందిస్తున్న నిర్వాహకులు

మలికిపురం: రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన ముప్పర్తి కృష్ణకార్తిక్ డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. విశాఖపట్నానికి చెందిన కె.రాహుల్‌తో కలసి కార్తిక్ ఈ ఘనత సాధించాడు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకూ హిందూపురంలో ఈ పోటీలు జరిగాయి. మలికిపురం శ్రీరాం బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు దెంతుకూరి రాంబాబురాజు, క్రీడాకరులు, ప్రిన్సిపాల్ తోరం సతీష్, కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి విద్యార్థులను అభినందించారు.

హృద్రోగులపై నిర్లక్ష్యం వద్దు



అంబాజీపేటలో రోగులకు పరీక్ష చేస్తున్న వైద్యుడు గురుకిరణ్

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో పాటు వేళాపాళా లేని ఆహారపు అలవాట్ల వల్ల హృద్రోగ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటి పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందాలని అమలాపురం మెడ్ యునైటెడ్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డి.గురుకిరణ్ అన్నారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న అంజుమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదు కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, సాధారణ, ఎముకల, స్త్రీల, కంటి, న్యూరాలజీ విభాగాల్లో సుమారు నాలుగు వందల మందికి వైద్య సేవలు అందించారు. కార్డియాలజీ విభాగంలో డాక్టర్ గురుకిరణ్, గ్యాస్ట్రో ఎంటరాలజీలో డాక్టర్ కేపీఆర్ కిషోర్, సాధారణ విభాగంలో డాక్టర్ జాయ్ సన్, ఎముకల విభాగంలో డాక్టర్ కీర్తి, స్త్రీల విభాగంలో డాక్టర్ సింధూజ, కంటి విభాగంలో డాక్టర్ సిద్ధిక్, న్యూరో ఫిజీషియన్ విభాగంలో డాక్టర్ రామ్ అభిషేక్, న్యూరో సర్జన్ డాక్టర్ రఘురాం పాల్గొని వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్డియాలజీ విభాగంలో ఒకరిని, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఒకరిని, కంటి విభాగంలో 30 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ కాదు.. వదంతి మాత్రమే..



నగరంలో నీటిని పరీక్షిస్తున్న ఓఎన్జీసీ ఉద్యోగులు

మామిడికుదురు: నగరం గ్రామంలో ఈదరాడ కాలువగట్టు ప్రాంతం బైపాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న వంతెన పక్కన గ్యాస్ లీకవుతుందంటూ శనివారం పుకార్లు షికారు చేశాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వంతెనకు సంబంధించిన రెండు స్పాన్ల మధ్య నీటిలో చిన్న చిన్న బుడగలు వస్తున్నాయని, అది గ్యాస్ లీకేజీకి సంబంధించినదే అని స్థానికులు భయపడ్డారు. సమాచారం అందుకున్న ఓఎన్జీసీ, గెయిల్ అధికారుల హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. బుడగలు వస్తున్నాయని తెలిపిన ప్రాంతంలో డిటెక్టర్లతో పరీక్షలు చేశారు. అక్కడ ఏ విధమైన గ్యాస్ లీకేజీ జరగలేదని, ఆ ప్రాంతంలో లీకేజీకి సంబంధించిన ఏవిధమైన ఆనవాళ్లు కనిపించలేదని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన పని లేదని గెయిల్ బేస్ ఇన్‌చార్జ్ కె.రాంబాబు, ఓఎన్జీసీ షిఫ్ట్ ఇన్‌చార్జ్ సురేష్ గుప్త తెలిపారు. లీకేజీ జరిగిందని చెబుతున్న ప్రాంతంలో అసలు ఏ విధమైన పైప్‌లైన్లు లేవని స్పష్టం చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అరటిపండ్లతో నివేదన

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు శనివారం మామిడికుదురు మెయిన్ రోడ్డులో శ్రీలక్ష్మీ గణపతి ఆటో గణపతి యూనియన్, వర్తకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మంటపం వద్ద లక్ష అరటి పళ్లు, లక్ష గరిక పూజ ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు శ్రీలక్ష్మీ గణపతి హోమం వైభవంగా జరిగింది. పూజ అనంతరం స్వామికి పూజ చేసిన అరటి పండ్లను భక్తులకు ప్రసాదంగా అందించారు. రాత్రి భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సఖినేటిపల్లి: మండలంలోని జీవీ పుంత హైస్కూల్ విద్యార్థులు ఆరుగురు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ విభాగంలో నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. శనివారం అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి పోటీల్లో వారు గెలుపొంది, నియోజకవర్గ స్థాయికి చేరినట్టు హెచ్ఎం డి.ప్రసాద్ తెలిపారు. అర్హత సాధించిన వారిలో టి.మౌనిక, జి.కావ్య, కె.మేరీ‌రూన్సీ, బి.మనోజ్‌కుమార్, ఎస్.రాకేష్‌వర్మ, జి.నాగేంద్ర బాబు ఉన్నట్టు పీఈటీ కె.సతీష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ కె.జాన్‌బాబు, ఎంపీటీసీ బి.నాగరాజు తదితరులు అభినందించారు.

లోక్ అదాలత్‌లో 61 కేసుల పరిష్కారం



కొత్తపేటలో లోక్ అదాలత్‌లో కేసులపై సమీక్షిస్తున్న చైర్మన్ రమణారెడ్డి



కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి

కొత్తపేట: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కరించి, వివిధ కేసుల ద్వారా రూ.44,40,781 రికవరీ చేశారు. ఆ మేరకు కోర్టు లోక్ అదాలత్ విభాగం ద్వారా ప్రకటన విడుదల చేశారు. లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి నిర్వహించిన బెంచ్‌లో 3 మనీ దావాలు పరిష్కరించి వాటి ద్వారా రూ.37.80 లక్షలు, 4 బ్యాంకు పీఎల్‌సీలు పరిష్కరించి రూ.6.47 లక్షలు, 19 బీఎస్ఎన్ఎల్ పీఎల్‌సీలు పరిష్కరించి రూ.13,781 రికవరీ చేశారు. 6 టైటిల్ దావాలు, 29 క్రిమినల్ ఐపీసీ కేసులు పరిష్కరించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు ఏటీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

రాజోలు: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. తొలుత కోర్టుకు హాజరైన కక్షిదారులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన లోక్‌అదాలత్‌లో 71 కేసులను పరిష్కరించారు. సివిల్ కేసుల ద్వారా రూ. 24.10 లక్షలు, 36 క్రిమినల్ కేసుల ద్వారా రూ.9 లక్షలు, బీఎస్ఎన్ఎల్ కేసుల ద్వారా రూ.20 వేలు, ఎనిమిది బ్యాంకు పీఎల్‌సీల ద్వారా రూ.4.43 లక్షలు కక్షిదారులకు పరిహారంగా లభించింది. లోక్‌అదాలత్ సభ్యులు జి.రజిత, వై.లక్ష్మి సుధ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

అంబాజీపేట: వివాహమై 14 ఏళ్లు అయినప్పటికీ అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంగలకుర్రు అగ్రహారంకు చెందిన కొల్లి దుర్గాప్రసాద్‌కు 14 ఏళ్ల క్రితం శ్యామలతో వివాహం అయిందన్నారు. అయితే తన భర్త దుర్గాప్రసాద్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని శ్యామల ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ఎంఈఓ నల్లి మనోహరం ప్రారంభించారు. బి.సావరంలోని కోరుకొండాస్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో ఎంఈఓ టీఎస్‌కేడీ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. తొమ్మిది ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలగా నిలిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామోపాధ్యాయులు చెల్లింగి ప్రసాద్, పెచ్చెట్టి రామకృష్ణ, వై.రాజీవ్, కట్టా శ్రీదేవి, ధర్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర నష్టం

రాజోలు: రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల యువత అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోతుందని మండల మాల న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు మట్టా సురేష్ కుమార్ అన్నారు. శనివారం రాజోలులో జరిగిన సమావేశంలో సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడం దారుణమన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపడుతున్నట్టు నాయకులు వివరించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు కోర్ కమిటీల నాయకులు ప్రసంగించారు. ఉపాధ్యక్షుడు మందపాటి మధు, కోశాధికారి చింతా మధుకుమార్, బత్తుల జనార్దనరావు, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు ఘన సత్కారం

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఇరువురు గురుస్వాములకు శనివారం ఘన సత్కారం జరిగింది. గ్రామంలో ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి (దొరబాబు) స్వామి ఆధ్వర్యంలో గత 39 ఏళ్ల నుంచి నిర్విరామంగా అయ్యప్ప స్వామి మాలధారణ శిబిరం కొనసాగుతుంది. అందులో భాగంగా ఇప్పటి వరకూ 18 ఏళ్ల పాటు అయ్యప్ప మాలధారణ ధరించి శబరిమలైకు వెళుతున్న గెద్దాడ శ్రీను, ఎం.సత్యనారాయణను సహచర అయ్యప్ప మాలధారులు ఘనంగా సత్కరించారు. అనంతరం గురుస్వామి నల్లమిల్లి రామారెడ్డి రూపొందించిన మెమెంటోలను అయ్యప్ప మాలధారులకు బహూకరించారు.

నేడు చలో విజయవాడకు రంగం సిద్ధం

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఇన్ సర్వీస్ కోటాలను క్లినికల్ సీట్ల విభాగంలో 15 శాతానికి, నాన్ క్లినికల్ విభాగంలో 30 శాతానికి తగ్గిస్తూ జీఓ నంబరు 85ను అమల్లోకి తీసుకువచ్చింది. రెండు నెలల కిందట జారీ చేసిన జీఓను వ్యతిరేకిస్తూ అనేక రూపాల్లో వైద్యుల బృందం తమ అసంతృప్తిని తెలిపారు. ఈనెల 10 నుంచి 12 వరకూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 13, 14 తేదీల్లో అత్యవసర కేసులు మినహా మిగతా సేవలు బహిష్కరించారు. ఇన్ని చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేక నేడు చలో విజయవాడకు పిలుపునిచ్చారు.

ఆక్వా చెరువులు యథాతథంగా కొనసాగించాలి

సఖినేటిపల్లి: అంతర్వేది సముద్ర తీరంలో ఆక్వా చెరువులు యథాతథంగా కొనసాగించే విధంగా జిల్లా ఉన్నతాధికారులు చూడాలని అంతర్వేది దేవస్థానం సర్పంచ్ కొండా జాన్‌బాబు అన్నారు. శనివారం ఆ గ్రామంలో ఆక్వా రైతులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆక్వా రంగానికి అవరోధాలు కలిగించే చర్యలు చేపట్టవద్దని అధికారులను ఆయన కోరారు. సముద్రం తీరం నుంచి 500 మీటర్లు వరకూ చెరువులను తొలగిస్తామని అంటున్న అధికారుల వైఖరిపై ఆక్వా రైతులు ఎంతో ఆందోళన చెందుతున్నారన్నారు. వందలాది మంది తీర ప్రాంతాల్లో ఆక్వారంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారన్నారు.